ఆరోగ్య సురక్ష..ప్రజలకు రక్ష


వైద్య సేవలపై ఆరా తీస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ


రొళ్ల: దొడ్డేరిలో కంటి అద్దాల పంపిణీ


మడకశిర మండలం ఆమిదాలగొందిలో బీపీ, సుగర్ పరీక్షలు

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గురువారం వివిధ ప్రాంతాల్లో స్పెషలిస్టు వైద్యులతో ఏర్పాటు చేసిన శిబిరాలకు ప్రజలు పోటెత్తారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగాలకు సంబంధించి ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం అందించేందుకు సిఫార్సు చేశారు.

హిందూపురం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు పట్టణంలోని 9వ వార్డులో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లో వైద్యాధికారులతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్యపరీక్షలు అందించి నాణ్యమైన మందులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ఈ శిబిరాల ద్వారా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. వైద్యులు మంజులశ్రీ, కర్మయ్యరెడ్డి, లోకేష్, ప్రవీణ్ రోగులకు వైద్య సేవలు అందించారు. వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ భూపాల్‌రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: బాలంపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి,మండల కన్వీనర్ రాము, సర్పంచ్ విజయలక్ష్మీ, తహసీల్దార్ స్వర్ణలత పాల్గొన్నారు.

రొళ్ల: దొడ్డేరి సచివాలయ ఆవరణలో వైద్యులు సౌందర్య, శ్రీనివాస్‌నాయక్, సతీష్, బాలప్రణీత్‌రెడ్డిలు 448 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ అనిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి కంటి అద్దాలు అందించారు. ఎంపీపీ కవిత, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ ఆజాద్ పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో వైద్యులు మాధుర్య, నరేష్‌లు రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. వైద్య చికిత్సల అనంతరం రోగులకు కేస్ షీట్‌ను అందించారు. ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరిగింది. వైద్యులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ షేక్‌రుబి, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ కపిల్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ అశ్వత్థనారాయణ 30 మంది గర్భిణులకు తన సొంత ఖర్చులతో సీమంతాలు నిర్వహించి పూలు, పండ్లు, చీర, గాజులు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్, మండల కన్వీనర్ నారాయణస్వామి, ఎంపీటీసీ నాగజ్యోతి పాల్గొన్నారు.


వానవోలులో ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి


ఆమిదాలగొందిలో వైద్య పరీక్షలు


బాలంపల్లిలో వైద్య కిట్లు అందజేస్తున్న కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యంలో డాక్టర్ నాగరాజు నాయక్ 350 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

గోరంట్ల: మండలంలోని వానవోలు సచివాలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేనివిధంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందన్నారు. నిపుణులైన డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారని, శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు.


లేపాక్షి: పులమతిలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు


పులమతిలో ఆరోగ్య శిబిరానికి భారీగా తరలి వచ్చిన ప్రజలు,


గర్భిణులకు చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్,


పెనుకొండ రూరల్: వెంకటగిరి పాళ్యంలో వైద్య పరీక్షలు

క్లుప్తంగా

ఆర్థిక సాక్షరతపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న మున్సిపల్ సీఓ సాధిక

హిందూపురం: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ఆర్థిక సాక్షరతపై అవగాహన పెంచుకోవాలని ఏడీసీసీ బ్యాంకు నోడల్ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఆబాద్‌పేటలోని జవహర్ లాల్ నెహ్రూ పాఠశాలలో గురువారం జరిగిన ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొదుపుపై అన్ని కమర్షియల్ బ్యాంకుల కంటే ఏడీసీసీ బ్యాంకు అధిక ప్రయోజనాలు కల్పిస్తుందన్నారు. ఆర్‌డీ, ఎఫ్‌డీ, ఆర్‌ఐపీ డిపాజిట్లతోపాటు వివిధ పొదుపు ఖాతాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం మున్సిపల్ సీఓ సాధిక మాట్లాడారు. బ్యాంకు మేనేజర్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల కన్వీనర్ల సమావేశం

మడకశిర: మడకశిరలోని మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఐదు మండలాల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ మహేష్‌జీని, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మారుతిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

రేడియం స్టిక్కర్ల ఏర్పాటు


డివైడర్లకు రేడియం స్టిక్కర్లను అతికిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులోని బ్లాక్ స్పాట్ల వద్ద 30వ వార్డు కౌన్సిలర్ ఆసీఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రేడియం స్టిక్కర్లను అతికించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదానికి గురై చిన్నారి ఆద్య మృతి చెందడం పట్టణ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రాత్రివేళల్లో డివైడర్లు, మలుపులు సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీంతో రేడియం స్టిక్కర్లను అతికించినట్లు తెలిపారు. జిమ్ షఫీ, ఆదిల్, కలీమ్, ముస్తఫా పాల్గొన్నారు.

నేడు కరికెరలో ఆరోగ్య సురక్ష

గుడిబండ: కరికెర గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రాధమ్మ, మండల కన్వీనర్ యంజారేగౌడు గురువారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వార్డులో కమిషనర్ పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

మడకశిర: పట్టణంలోని 17వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు గురువారం పర్యటించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సుభద్ర కోరారు. ఏఈ మురళి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్ర ఉన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు

అమరాపురం: మండలంలోని హలుకూరు, అమరాపురం గ్రామ పంచాయతీలో గురువారం ఉపాధి పనుల గుర్తింపుపై సమావేశం జరిగింది. ప్రజలను సమావేశ పరచి వారికి అవసరమైన, గ్రామానికి ఉపయోగపడే అభివృద్ధి పనులపై అధికారులు చర్చించారు. గుర్తించిన పనులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు సచివాలయం అధికారులు తెలిపారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ ప్రతినిధులు

పెనుకొండ: బైబిల్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో గురువారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ సుధాకర్, డానియల్ అయ్యర్, ఏలియా అయ్యర్ పాల్గొని ఏసుక్రీస్తు బోధనలను వినిపించారు. సర్వ మానవాళి సంక్షేమం కోసం, ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడిచేందుకు అవసరమైన బోధనలు బైబిల్‌లో ఉన్నాయన్నారు. గుంటూరుకు చెందిన శ్యామ్యూల్ అయ్యర్ ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు


రోడ్డు సౌకర్యం కోసం పరిశీలన చేస్తున్న తహసీల్దార్

మడకశిరరూరల్: హరేసముద్రం బీసీ కాలనీలో నెలకొన్న రోడ్డు సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్ ముర్షావలీ గురువారం గ్రామంలో పర్యటించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి హరేసముద్రంలో చెరువు వద్ద సర్వే చేయించారు. సర్పంచ్, వైస్ ఎంపీపీ, కాలనీ పెద్దలతో సమావేశమయ్యారు. కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఇప్పటివరకు వెళ్లినట్లుగానే పట్టా భూమిలోనే రాకపోకలు సాగించేలా పెద్దలతో ఒప్పించారు. రోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణ చేసి పట్టా భూమి రైతులకు పరిహారం అందించి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎస్‌ఐ లోకేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల మాయలో పడొద్దు
సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి, ఎస్సీ సెల్ నాయకుడు లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడుతూ బీసీ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్నప్పటి నుంచి ఈరోజు వరకు పట్టా భూమిలోనే ప్రజలు కాలనీలోకి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఏనాడు అభ్యంతరం చెప్పలేదన్నారు. రాజకీయ లబ్ధి పొందడానికి టీడీపీ నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. బీసీ కాలనీకి శాశ్వత దారి సౌకర్యం కల్పించే విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

ఆలయ స్థల పరిశీలన

పావగడ: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన కన్యకా పరమేశ్వరి ఆలయం వివాదంలో చిక్కుకుంది. ఈ ఆలయం తమ ఆరాధ్య దైవమైన నీలకంఠేశ్వర స్వామి ఆలయమని, ఇందుకు తమ వద్ద ఆధారాలున్నాయని టీఎన్ పేట గ్రామానికి చెందిన రామాంజినప్ప కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చారు. దీంతో ఎండోమెంట్ అధికారి తహసీల్దార్ వరదరాజు గురువారం ఆలయ స్థల పరిశీలన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సుదేశ్ బాబు మాట్లాడుతూ పూర్వం నుంచి ఈ ఆలయం కన్యకా పరమేశ్వరి దేవాలయంగా ప్రసిద్ధి చెందిందని, అందుకు సంబంధించిన దాఖలాలు ఉన్నాయన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న తహసీల్దార్.. ఆ ఆలయం నీలకంఠేశ్వర దేవాలయం పేరుపై తమ వద్ద ఉన్న రికార్డుల్లో లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం.

పారిశుధ్య పనులు చేపట్టండి
అమరాపురం: మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ మునిస్వామి సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. మరుగు కాలువల్లో పూడిక తొలగింపజేయాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఘనంగా శరత్‌చంద్ర శంకర్ శ్రీఖండే జయంతి
పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గణిత శాస్త్రవేత్త శరత్ చంద్ర శంకర్ శ్రీకండే జయంతిని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శరత్‌చంద్ర శంకర్ శ్రీఖండే భారతీయ గణిత శాస్త్రంలో విశేషమైన పరిశోధనలు చేసి దేశానికి పేరు తెచ్చారన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్
హిందూపురం అర్బన్: పట్టణంలోని అహమ్మద్ నగర్, కాలువ కట్ట వద్ద మట్కా రాస్తుండగా సీఐ వీ శ్రీనివాసులు గురువారం దాడి చేశారు. అమీర్‌బాషా, రియాజ్, షేక్ మజురుల్లా, నాగరాజు అనే బీటర్లను అరెస్ట్ చేసి మట్కా పట్టీలతో పాటు రూ.58 వేలు స్వాధీనం చేసుకున్నారు.

టిప్పర్లు స్వాధీనం
పెనుకొండ రూరల్: మండలంలోని ఎర్రమంచి చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండగా ఇరిగేషన్ శాఖ జేఈ ప్రసన్న కమార్ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. టిప్పర్లను స్వాధీనం చేసుకొని కియా పోలీస్ స్టేషన్ తరలించినట్లు కియా ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి
పావగడ: అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరిహరపుర గ్రామానికి చెందిన ఈరణ్ణ (43) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గొడన

సంక్షిప్త సమాచారం

చెరువు సమీపంలో ఇతను చెట్టుకు వేలాడుతుండగా స్థానికులు గమనించి భార్య కరియమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమె వెళ్లి చూసి అతను తన భర్తేనని గుర్తించి భోరున విలపించింది. అరసికెరె ఎస్‌ఐ థారాసింగ్ వెళ్లి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక సాయం అందజేత
రొళ్ల: అలుపనపల్లి క్లస్టర్‌లో (సీఆర్‌ఎంటీ) క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్‌గా పని చేస్తున్న రంగనపల్లికి చెందిన శివన్న ఈ నెల 11న అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సీఆర్‌ఎంటీ జిల్లాధ్యక్షుడు వెంకటరమణ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని మృతుడు భార్య మంజులకు అందించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి
పరిగి: మండలంలోని మోదా సమీపంలోని ఓ లేఔట్ వద్ద ఈనెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామగిరి మండలం గరిమేకలపల్లికి చెందిన అశోక్‌కుమార్(23) గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఈయన మోదాలోని తన బంధువు ఇంటికి వచ్చి తిరిగి బైక్‌లో వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు. బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రైవేటు వ్యక్తితో తీగల మరమ్మతులు.. విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న హనుమంతు

హిందూపురం అర్బన్: విద్యుత్ తీగల మరమ్మతు కోసం ప్రైవేటు వ్యక్తిని స్తంభం ఎక్కించగా అతను విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. మండలంలోని సంతేబిదనూరు–హనుమేపల్లి వద్ద గురువారం విద్యుత్ మరమ్మతులు చేసేందుకు లైన్‌మెన్ మురళి ఎల్‌సీ తీసుకున్నాడు. హనుమంతు అనే వ్యక్తిని స్తంభం ఎక్కించాడు. అయితే పొరపాటున ఎల్‌సీని మరో లైన్‌కు తీసుకోవడంతో స్తంభం ఎక్కగానే హనుమంతు విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. గాయపడిన అతన్ని తొలుత హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. జూనియర్ ఏఈ జబీవుల్లా ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై సమగ్ర విచారణ చేయిస్తామని డీఈ నాగన్న, ఈఈ భూపతి తెలిపారు.

జగజ్జననీ పాహిమాం

సాక్షి నెట్‌వర్క్: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


హిందూపురం: కుంకుమార్చన పూజల్లో మహిళలు


రొళ్ల: మహాచండీ దేవిగా కొల్హాపురి మహాలక్ష్మీదేవి


గోరంట్ల: దుర్గామాతకు అలంకరణ


లేపాక్షి: శిరివరంలో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి


గోరంట్లలో అర్ధనారీశ్వరిగా చౌడేశ్వరీమాత


హిందూపురం: మహాచండీ అలంకరణలో కొల్హాపూరీ లక్ష్మీదేవి


హిందూపురం:జలదుర్గమ్మకు అనపగింజలతో కాత్యాయినీదేవి అలంకరణ


లేపాక్షి: బాలత్రిపురసుందరి దేవి అలంకరణలో దుర్గాదేవి


హిందూపురం: ప్రత్యేక అలంకరణలో మారెమ్మ అమ్మవారు


పరిగి: కాళికామాతకు అలంకరణ


పెనుకొండ: దానిమ్మ పండ్ల అంకరణలో వాసవీమాత


పావగడ: మహా ప్రత్యంగిరా అలంకరణలో కాళికాదేవి


అమరాపురం: కోదండ రామస్వామిగా వేంకటేశ్వరస్వామి

కలప మాఫియాపై చర్యలు తీసుకోండి


సమావేశంలో పర్యావరణ వేత్తలు

హిందూపురం టౌన్: కలప మాఫియాతో చేతులు కలిపిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పర్యావరణ వేత్తలు భాస్కర్ రెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, ధనాపురం వెంకటరామిరెడ్డి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కలప మాఫియా పచ్చని చెట్లను నేలకూల్చి కలపను సామిల్స్‌కు అక్రమ రవాణా చేస్తోందన్నారు. ఇందుకు కొందరు అధికారులు సహకారం అందేజేస్తున్నారని ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి కలప అక్రమ రవాణాను అడ్డుకొని వాటిని అటవీశాఖకు అప్పగిస్తామన్నారు. ఉమర్ ఫారూఖ్, జగదీష్, శ్రీధర్, హరిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

రొద్దం: ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనంతాచారి తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీ వద్దనున్న సర్వే నంబర్ 966–4 లెటర్‌లో 2 ఎకరాల నాలుగు సెంట్ల ప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశించకుండా గురువారం బోర్డు ఏర్పాటు చేయించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

సోమందేపల్లి: గుడిపల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, మాజీ కన్వీనర్ వెంకటరత్న తెలిపారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు.

మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే


మంత్రి పెద్దిరెడ్డితో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ రూరల్: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా మార్గం మధ్యలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, రామ్మోహన్ రెడ్డి,లక్ష్మిరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లు మంజూరు చేయండి


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేయాలని గురువారం అనంతపురం వచ్చిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందించినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ప్రతి మండలానికి రెండు సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మధుమతి


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమస్యలు వివరిస్తున్న చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం: అనంతపురంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పలు ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి పరిష్కరింపజేయిస్తామని హామీ ఇచ్చారని మధుమతిరెడ్డి తెలిపారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

గోరంట్ల: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో ట్యాలీ కోర్సులో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి ఉండాలని పేర్కొన్నారు. 18 నుంచి 26 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. శిక్షణ కాలం 35 రోజులు ఉంటుందని, ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9000487423 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

రొద్దం: మండల వ్యాప్తంగా వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తురకలాపట్నం 1, రొద్దం 3, సానిపల్లి 1, తాడింగిపల్లి 2, ఎం.కొత్తపల్లిలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.